# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 16-04-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో మొత్తం 125 కోట్ల 96 లక్షల రూపాయల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నామని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా వెల్లడించారు.**

2. **భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు... 18 ఏళ్ల లోపు బాలలను రాజకీయ పార్టీలు ఎన్నికల కార్యక్రమాల్లో గానీ, ప్రచార పనులకు గానీ వినియోగించకూడదని కార్మిక శాఖ స్పష్టం చేసింది.**

3. **వస్తు సేవల పన్నుపై ఉద్యోగులకు శిక్షణ, సాంకేతిక నైపుణ్యం మెరుగుదల కోసం 'ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా - ఐకాయ్‌తో రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ రెండేళ్లకు ఒప్పందం కుదుర్చుకుంది.**

4. **వందేభారత్ రైళ్లకు ప్రయాణికుల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని రైల్వేశాఖ తెలిపింది.**

5. **తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించిన జులై నెల కోటాను ఈ నెల 18వ తేదీ ఉదయం 10 గంటలకు తిరుమల తిరుపతి దేవస్థానం ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.**

==========================

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో మొత్తం 125 కోట్ల 96 లక్షల రూపాయల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నామని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా వెల్లడించారు. ఇందులో 32 కోట్ల 15 లక్షల నగదు, 19 కోట్ల 72 లక్షల రూపాయల విలువైన మద్యం, 4 కోట్ల 6 లక్షల రూపాయల విలువైన మాదక ద్రవ్యాలు, 57 కోట్ల 14 లక్షల రూపాయల విలువైన లోహాలు, 12 కోట్ల 89 లక్షల రూపాయల విలువైన ఇతర వస్తువులు ఉన్నాయని ముఖేష్ కుమార్ మీనా తెలిపారు.

--------------------------

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు... 18 ఏళ్ల లోపు బాలలను రాజకీయ పార్టీలు ఎన్నికల కార్యక్రమాల్లో గానీ, ప్రచార పనులకు గానీ వినియోగించకూడదని పార్వతీపురం మన్యం జిల్లా కార్మికశాఖ సహాయ కమీషనర్ కె. రామకృష్ణారావు తెలిపారు. బాలలను రాజకీయ కార్యకలాపాలకు వినియోగించుకుంటే బాల కార్మిక నిషేద చట్టం ప్రకారం 6 నెలల జైలు శిక్ష, 50 వేల వరకు జరిమానాకు బాధ్యులవుతారని హెచ్చరించారు. రాష్ట్ర కార్మిక కమీషనర్ ఆదేశాల ప్రకారం ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులను... ముఖ్యంగా

ఇటుక బట్టీలలో పనిచేసే అంతర్ రాష్ట్ర వలస కార్మికులను తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వారి రాష్ట్రంలోని స్వగ్రామాలకు తప్పనిసరిగా పంపించాలని, పంపించని యజమానులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

-----------------------------

ప్రస్తుతం విద్యా సంవత్సరం ముగిసే నాటికి విద్యార్థుల వార్షిక పరీక్షల ప్రగతి నివేదికను విద్యార్థుల తల్లిదండ్రులకు అందజేస్తామని పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ తెలిపారు. ఈ నెల 23వ తేదీ విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం ఉంటుందని ఒక రోజు ముందే గుర్తు చేయాల్సిన బాధ్యత ఆయా తరగతుల ఉపాధ్యాయులదేనని ఆయన స్పష్టంచేశారు. ఈ ఏడాదితో పాటు గత రెండు తరగతుల సామాన్య, సాంఘిక శాస్త్ర పుస్తకాలు వేసవి సెలవుల్లో చదివే విధంగా విద్యార్థులను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులు తీసుకోవాలని ప్రవీణ్ ప్రకాష్ సూచించారు.

-----------------------------

వస్తుసేవల పన్ను – జీఎస్టీపై ఉద్యోగులకు శిక్షణ, సాంకేతిక నైపుణ్యం మెరుగుదల కోసం 'ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా – ఐకాయ్ తో రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ రెండేళ్లకు ఒప్పందం కుదుర్చుకుంది. ఇందుకు సంబంధించిన ప్రక్రియ మంగళగిరిలోని రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ ప్రధాన కార్యాలయంలో నిన్న జరిగింది. ఈ సందర్భంగా వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ గిరిజా శంకర్ మాట్లాడుతూ.. ఆడిటర్లు, పన్నుల శాఖ అధికారులు ఉత్తర, దక్షిణ ధ్రువాలనే అభిప్రాయాన్ని తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. డివిజన్, రాష్ట్రస్థాయిలో ట్రేడ్ అడ్వయిజరీ కమిటీలు ఏర్పాటు చేశామని.. విధానపరమైన నిర్ణయాలు, సాంకేతికత ఆధారంగా పన్ను ఎగవేసే వారిని గుర్తిస్తున్నట్లు తెలిపారు. వ్యక్తుల ప్రమేయాన్ని నియంత్రిస్తూ డేటా అనలిటిక్ సెంటర్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు. తాజా ఒప్పందం ద్వారా అపోహలు తగ్గుతాయని, పన్ను చెల్లింపు వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు పరస్పరం సహకరించుకోవాలని పేర్కొన్నారు.

-----------------------------

వందేభారత్ రైళ్లకు ప్రయాణికుల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని రైల్వేశాఖ తెలిపింది. 2019 ఫిబ్రవరి 15వ తేదీన ఢిల్లీ– వారణాసి మధ్య ప్రారంభమైన తొలి సర్వీసు నుంచి ఈ ఏడాది మార్చి 31వ తేదీ వరకు ఈ సెమీ హైస్పీడ్ రైళ్లలో రెండు కోట్ల మందికిపైగా రాకపోకలు సాగించారని రైల్వే అధికారులు వెల్లడించారు. ప్రయాణికుల్లో.. ముఖ్యంగా యువత నుంచి ఈ రైళ్లకు గణనీయమైన ఆదరణ అభిస్తోందని తెలిపారు. ముంబయి–థాణెల మధ్య దేశంలోనే తొలి రైలు ప్రయాణం ప్రారంభమై నిన్నటికి 171 సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో రైల్వే అధికారులు ఈ వివరాలు వెల్లడించారు.

-----------------------------

అనంతపురం జిల్లాలో ఓటు హక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు. అనంతపురం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో స్వీప్ ఆధ్వర్యంలో ఓటు హక్కు వినియోగంపై ఈ రోజు నిర్వహించిన రంగోలి కార్యక్రమంలో భాగంగా మహిళలు ముగ్గులతో ఓటు హక్కు ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాత్రికేయులతో మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. ఓటింగ్ శాతం పెంచడానికి జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆయన వివరిస్తూ..

...వాయిస్...27 సెకన్లు

-----------------------------

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించిన జులై నెల కోటాను ఈ నెల 18వ తేదీ ఉదయం 10 గంటలకు తిరుమల తిరుపతి దేవస్థానం ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవా టికెట్ల కోటాను ఈ నెల 22వ తేదీ ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నారు. వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్ల టికెట్లను ఆ రోజు మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేస్తారు. తిరుమల, తిరుపతిలో గదుల కోటాను ఈ నెల 24వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకొస్తారు. 300 రూపాయల ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను 24వ తేదీ ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నామని టీటీడీ తెలిపింది.

---------------------------

కృష్ణా నది యాజమాన్య బోర్డు – కే. ఆర్. ఎం. బీ. సమావేశం ఈ నెల 22వ తేదీన నిర్వహించనున్నట్లు బోర్డు సభ్య కార్యదర్శి డీ. ఎం. రాయిపురే ఆంధ్రప్రదేశ్తె, లంగాణ రాష్ట్రాలకు సమాచారం పంపారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి బోర్డుకు సంబంధించిన బడ్జెట్‌పై ఈ సమావేశంలో చర్చించనున్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించనున్న ఈ సమావేశంలో బోర్డు ఛైర్మన్ శివ్‌నందన్ కుమార్, తెలంగాణ నీటిపారుదల కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి పాల్గొననున్నారు.

---------------------------

రాష్ట్రంలోనే మొట్టమొదటిదిగా కర్నూలు జిల్లాలో ఏర్పాటు చేసిన అంధుల డిజిటల్ లైబ్రరీ అంధ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఇవ్వనుందని జిల్లా కలెక్టర్ డా జి.సృజన పేర్కొన్నారు. కర్నూలులోని జాతీయ అంధుల సమాఖ్య స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఈ డిజిటల్ లైబ్రరీను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...మారుతున్న సాంకేతికత కు అనుగుణంగా అందరికీ సౌకర్యాలను అందుబాటులోకి తీసుకొని రావడం ముఖ్యమని పేర్కొన్నారు. చదువుకునే పుస్తకాలు, పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాల నుండి, సాహిత్య పుస్తకాల ద్వారా మిగిలిన వారిలాగే దృష్టి లోపం వున్న వారు సైతం జ్ఞానం పొందాలన్న ఒక మంచి సంకల్పంతో డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ లైబ్రరీలో ఉపయోగిస్తున్న టెక్నాలజీ ద్వారా పుస్తకాలను ఆడియో రూపంలో విని చదువుకోవచ్చని జిల్లా కలెక్టర్ వివరించారు.

---------------------------

వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్టలోని శ్రీకోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించడానికి తిరుమల తిరుపతి దేవస్థానం పటిష్ట ఏర్పాట్లు చేస్తోంది. నేటి నుంచి 26వ తేదీ వరకు పది రోజులపాటు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీన సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని బహిరంగ ప్రదేశంలో లక్షమంది వీక్షించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. కల్యాణ మహోత్సవానికి ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ రోజు రాత్రి అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమై ఈ నెల 26న పుష్పయాగంతో ముగుస్తాయి.

---------------------------

తెలంగాణలోని న్యాయ కళాశాలల్లో ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే లాసెట్, పీజీ ఎల్ సెట్ పరీక్షలకు దరఖాస్తుల గడువు పొడిగించారు. తొలుత ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం నిన్నటితో దరఖాస్తు చేసుకునేందుకు గడువు ముగియగా.. మరో పది రోజుల పాటు పొడిగించారు.

=====================